

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## నాతిచరామి

**శోకదేవతలా** ఉన్న సుమిత్రని చూసి గోపాలం హడలిపోయాడు.

"ఏమైంది? ఎందుకలా ఉన్నావు?" కంగారుగా అడిగాడు.

"నీ డబ్బు పిచ్చి తగలెయ్య. ఈ ఆఫ్రికాలో తెచ్చి పడేసావు. మనుషులతో సంబంధాలు లేకుండా చేసావు" సుమిత్ర కోపంగా అరిచింది.

"ఏమైందంటే చెప్పవే? నన్ను తర్వాత తిట్టచ్చు. ముందు విషయం చెప్పు" గోపాలం బతిమాలాడు.

"సాగర్ పోయాట్ట" సుమిత్రలో మళ్ళీ దుఃఖం పొంగుకు వచ్చింది.

"సాగర్ ఎవరు?" చటుక్కున గుర్తురాని గోపాలం అయోమయంగా అడిగాడు.

"వినయ్ సాగర్. మా విద్య వాళ్ళాయన"

అందంగా, హుందాగా, ఉత్సాహంగా ఉండే నడివయస్కుడు గోపాలం కళ్ళముందు కదలాడాడు.

"అరెరె! పాపం ఎందుకటా?"

"ఏక్సిడెంట్. లారీ గుద్దేసిందిట. చాలా రోజులైందని ఇవాళ మా అమ్మకి ఫోన్ చేస్తే చెప్పింది. ఇంటర్నెట్ లేని కుగ్రామంలో తెచ్చి పడేసావు. ఫోన్‌కాల్‌కి నిమిషానికి డాలరవుతుందని ఫోన్లు కూడా చేసుకోనివ్వవు. నీలాంటి పిసినారి మూలంగా ముఖ్యమైన వార్తలు కూడా తెలీకుండా పోతున్నాయి" సుమిత్ర ముక్కు చీదింది.

"మీ అమ్మతో, విద్యతో ఊరికే పనికిమాలిన మాటలు మాట్లాడుతున్నావని చెప్పా అంతేకాని పదిరోజులకొకసారి మాత్రమే ఫోన్ చేసుకోమని కాదు." గోపాలం కోపంగా చెప్పాడు.

"నేను అర్జెంట్‌గా హైదరాబాద్ వెళ్ళాలి. టిక్కెట్ కొను"

విద్యతో ఆమెకి గల అనుబంధం తెలిసిన గోపాలం మారు మాట్లాడలేదు.

ఐదు రోజుల తర్వాత హైదరాబాద్‌లో అడుగుపెట్టిన సుమిత్ర ఏర్‌పోర్ట్‌లో కనిపించిన తమ్ముడ్ని చూసి అనుమానంగా అడిగింది.

"నేను వస్తున్నట్లు నీకెలా తెలుసురా? మీ పీనాసి బావ ఫోన్ చేసి చెప్పాడేంటి?"

"అవునే. నువ్వు సరాసరి విద్య వాళ్ళింటికి వెళ్తావేమోనని అమ్మ నన్ను పంపించింది. మొదట చావింటికి వెళ్తే, మనింటికి రాడానికి లేదుట" తమ్ముడు ట్రాలీ తోస్తూ చెప్పాడు.

సుమిత్ర మొహం కోపంతో ఎర్రబడింది.

"చావు ఇల్లా? మనందరం పర్మినెంట్‌గా ఉంటామేంట్రా? ఐనా అమ్మతో వాదించడం కంటే నోర్మూసుకుని ఒక గంట కూర్చుని వెళ్తే సరి. పద" చెప్పింది

"ఆల్‌రెడీ పది ఐంది. రేపు పొద్దున్నే వెళ్దువుగానిలే" తల్లి అభ్యంతరం చెప్పింది.

"అమ్మా నేను హైదరాబాద్‌లో దిగి ఇంతసేపైనా విద్యని కలవలేదని సిగ్గుపడుతున్నాను. ప్లీజ్. నన్ను ఆపొద్దు. ఒరే నన్ను డ్రాప్ చేస్తారా? లేదా కేబ్ మాట్లాడు" సుమిత్ర తమ్ముడితో చెప్పింది.

"నేను దింపుతా పద" తమ్ముడు కారు తాళం చెవులు తీసుకున్నాడు.

"అమ్మా! నాకు ఎప్పుడు రావాలనిపిస్తే అప్పుడు వస్తా. మధ్య మధ్యలో ఫోన్ చేస్తూంటాలే" సుమిత్ర తల్లికి చెప్పింది.

"నిజంగా దారుణం అక్కా. గ్రానైట్ స్టోన్స్ తెస్తున్న లారీ డివైడర్ ఎక్కి ఆపోజిట్ డైరెక్షన్‌లో వస్తున్న ఎడ్లబండిని గుద్ది, ఆ తర్వాత ఒక ఆటోని, ఆ తర్వాత సాగర్ కారుని గుద్ది, తర్వాత ఓ మోటర్ సైకిల్‌ని ఈడ్చుకుంటూ వెళ్ళి డౌన్‌లో పడిపోయింది. మొత్తం పద్నాలుగుమంది పోయారు. ఐదారుగురు సీరియస్ ఇంజురీస్‌తో హాస్పిటల్లో ఉన్నారు. సాగర్ సీట్ బెల్ట్ పెట్టుకోకపోవడంతో ఏర్ బేగ్స్ ఓపెన్ అవలేదు. స్టీరింగ్ ఛాతీకి ఒత్తుకుని పోయాడు. ఇంకెక్కడా గాయాల్లేవు. పాపం ఆరోజు విద్య ఏడ్చిన ఏడుపుకి చూడ్డానికి వచ్చిన వాళ్ళు కూడా ఏడ్చారు.."

తమ్ముడు చెప్తుంటే సుమిత బాధగా కళ్ళుమూసుకుంది.

రెండుసార్లు కాలింగ్ బెల్ మోగించినా తలుపు తీయకపోవడంతో ఇంట్లో ఎవరూ లేరేమోనన్న అనుమానం వచ్చింది. మరోసారి నొక్కబోతుంటే వరండాలో లైట్ వెలిగింది. తర్వాత తలుపు నెమ్మదిగా తెరుచుకుంది.

తలుపు తెరిచిన విద్యని చూసి సుమిత్ర నిర్ఘాంత పోయింది. ఒక నిష్క్రమణ ఒక మనిషిని ఇంతగా మార్చేయగలదని పుస్తకాల్లో చదివితే, సుమిత్ర 'అతిశయోక్తి' అనుకునేది.

గుండ్రటి విద్య మొహం సాగి పొడవుగా అయింది. చేతులు పుల్లల్లా ఉన్నాయి. కళ్ళకింద నల్లటి వలయాలు. వేలిముడి వేసుకున్న జుట్టు. అందంగా, అంతకు మించిన అలంకరణతో యువరాణిలా మెరిసిపోతూండే విద్య రంగు వెలిసిన బొమ్మలా వుంది.

సుమిత్రని చూసిన విద్య దుఃఖంతో బిగ్గరగా ఏడుస్తూ ఆమె చేతుల్లో వాలిపోయింది. సుమిత్ర కూడా ఏడవసాగింది.

ఒక నిమిషానికి తెప్పరిల్లిన విద్య తలుపు పూర్తిగా తీసి సుమిత్ర సూట్ కేస్‌ని లోపలికి లాక్కెళ్తూ అడిగింది.

"రా సుమీ ఇండియా ఎప్పుడొచ్చావు? గోపాలంగారు బావున్నారా?"

"ప్రామిస్ విద్యా! నాలుగురోజుల క్రితందాకా నాకీ విషయం తెలీదు. తెలియగానే వెంటనే వచ్చేసాను. ఈ దుఃఖసమయంలో నీ పక్కన లేనందుకు నాకెంత సిగ్గుగా ఉందో చెప్పలేను" సుమిత్ర బాధగా చెప్పింది.

"ఎక్కడో ఆఫ్రికాలో ఉన్న నీకెలా తెలుస్తుంది సుమీ? నేను నిన్నేం అపార్థం చేసుకోలేదులే. స్నానం చేసిరా అన్నం తిందాం" విద్య మృదువుగా చెప్పింది.

విద్య ఇంట్లో సుమిత్ర కోసం ఓ పర్మినెంట్ గది ఉంది. ఎంతో అవసరం అయితేగానీ విద్య దాన్ని గెస్ట్‌లకి కేటాయించదు. వాళ్ళ స్నేహం గురించి తెలిసిన సాగర్ కూడా అందుకు ఎప్పుడూ అభ్యంతరం చెప్పలేదు. ఆ గదిలోకి వెళ్ళిన సుమిత్ర గోడకున్న పెద్ద ఫోటోని చూసింది. గోపాలం, తను, విద్య, వినయ్‌సాగర్. ఒకరి భుజం మీద ఒకరు చేతులు వేసుకుని నవ్వుతూ చూస్తున్నారు. మరో గోడకి తను, విద్య రెండు జడలు, ఓణీలు, ఎడం చేతికి స్ట్రాప్ వాచీల్లో స్నిగ్ధంగా కనిపిస్తున్నారు. గదిలోని క్వీన్ బెడ్‌మీద తనకి ఇష్టమైన ఎర్రరంగు దుప్పటి పరిచివుంది.

స్నానం ముగించాక నైటీ వేసుకుని హాల్లోకి వెళ్ళింది. విద్య డైనింగ్ టేబుల్ మీద పాత్రలు సర్దుతోంది.

"పిల్లలు పడుకున్నారా?" సుమిత్ర చుట్టూ చూస్తూ అడిగింది.

"లేరు. ఇద్దరూ బయటే ఉన్నారు హాస్టల్స్‌లో"

"నిన్ను ఒక్కదాన్నే వదిలేసి వెళ్ళారా? కొంతకాలం ఉండాల్సింది"

"ఎంతకాలమైతే ఈ బాధ తగ్గుతుంది సుమీ?" విద్య నవ్వుతూ ప్రశ్నించింది.

సుమిత్ర ఏం మాట్లాడలేదు.

ఆ ఇల్లు, ఫర్నిచర్, డెకొరేషన్ అంతా వైవిధ్యంగా, కళాత్మకంగా అందంగా ఉన్నాయి. అదంతా వినయ్‌సాగర్ అభిరుచే. వినయ్ పర్ఫెక్షనిస్ట్. రాజీపడేవాడేకాదు. ఇంట్లో కూడా ప్రతీ వస్తువూ పెట్టిన చోటే ఉండాలి. కొంచె స్థానభ్రంశమైనా కోపం వచ్చేసేది. ఎవరైనా ఉంటే తమాయించుకునేవాడు. లేనప్పుడు చాలా అరుస్తాడని విద్య చెప్పేది. కానీ విద్య, పిల్లలు అంటే ప్రాణంగా ఉండేవాడు. ఎదుటివాళ్ళకి ఆ ప్రేమ ప్రస్ఫుటంగా తెలిసేది.

అలాంటి భార్యాపిల్లల్ని, ఆ ఇంటిని వదిలి నిమిషంలో ఎలా మాయమైపోయాడు? సుమిత్రకి వైరాగ్యం కలిగింది.

భోజనాలయ్యాక ఇద్దరూ సుమిత్ర గదిలో పడుకున్నారు.

"వినయ్‌కి కనబడే చిన్నగాయం కూడా లేదు సుమీ. నిద్రపోతున్నట్లే ఉన్నాడు. కానీ ప్రాణం పోయేంత దెబ్బ తగిలిందంటే, 'అయ్యో! ఆఖరి నిమిషాల్లో ఎంత విలవిల్లాడిపోయాడో, ఎంత బాధపడ్డాడో' అని రోజుల తరబడి ఏడ్చాను సుమీ. తర్వాత ఈ తరహా చావుల గురించి ఇంటర్నెట్‌లో వెదికి చదివాను. అలా దెబ్బ తగిలినప్పుడు బ్రెయిన్ షాక్‌కి గురవుతుందిట. నొప్పి తెలీకుండానే ఆ షాక్‌లోనే ప్రాణాలు పోతాయిట. అది చదవగానే కొంచెం బాధ తగ్గింది .కానీ విన్నూ లేకపోతే బావుండలేదు సుమీ" విద్య కళ్ళవెంట నీళ్ళు కారుతూంటే చెప్పింది.

సుమిత ఓదార్పుగా ఆమె చేతిమీద తట్టింది.

విద్యలేచి దిండుకి చేరగిలబడి కూర్చుంది.

"సుమీ నీకో విషయం చెప్పనా?"

సుమిత్ర కూడా లేచి కూర్చుంది.

"ఏక్సిడెంటైనప్పుడు కారులో వినయ్ ఒక్కడే లేడు. పక్కనే ఓ అమ్మాయికూడా ఉంది" విద్య నిర్లిప్తంగా చెప్పింది.

"ఏమిటి?" సుమిత్ర నివ్వెరపోయింది.

"అవును ఇప్పుడు ఆ అమ్మాయి కోమాలో ఉంది. బతికే అవకాశం లేదన్నారు. ఆ ఏరియా కమీషనర్ మా నాన్నకి మేనల్లుడు. వినయ్‌కి ఏక్సిడెంట్ అయిందనగానే ఆయన వెంటనే ఏక్సిడెంట్ స్పాట్‌కి వెళ్ళారట. కారులో పక్కన ఆ అమ్మాయిని చూసి మొదట

నేనేమో అనుకుని భయపడ్డారట. కానీ నేను కాకపోవడంతో వెంటనే ఇన్‌స్పెక్టర్లని ఆ విషయం బయటకి రాకూడదని హెచ్చరించాడట లారీ చాలా వాహనాలని గుద్దింది కాబట్టి ఆ విషయం దాచడం పెద్ద కష్టమేమీ కాలేదు"

"దారిలో ఎవరికైనా లిఫ్ట్ ఇచ్చి ఉంటాడు విద్యా" సుమిత్ర ఓదార్పుగా చెప్పింది.

"ఆ రోజు శుక్రవారం. పిల్లలిద్దరూ హాస్టల్స్ నించి ఇంటికి వచ్చారు. వినయ్ సాయంత్రం ఆఫీస్ నుంచి రాగానే తను రాత్రికి భాస్కర్ వాళ్ళ ఇంటికి నైట్ అవుట్‌కి వెళ్తున్నానని చెప్పాడు. భాస్కర్ భార్య పిల్లల దగ్గరకి అమెరికా వెళ్ళిందని, తను, ఫ్రెండ్స్ శుక్ర, శనివారాలు వాళ్ళింట్లో పేకలాడుకుంటూ, బీర్ తాగుతూ ఎంజాయ్ చేస్తాం అని వినయ్ నెలకి రెండు మూడుసార్లు వీకెండ్స్ వాళ్ళింటికి వెళ్తున్నాడు. 'పిల్లలు వచ్చారుగా ఈ వారం వాళ్ళతో గడుపుదాం' అని చెప్పాను. తన ఫ్రెండ్స్ డిజప్పాయింట్ అవుతారని శనివారం త్వరగా వచ్చేస్తానని చెప్పి నైట్ డ్రస్ తీసుకుని వెళ్ళిపోయారు. నేనూ పిల్లలు కబుర్లు చెప్పుకుంటూ అన్నం తిని టి.వి చూస్తున్నాం" విద్య కంఠం రుద్ధమైంది.

సుమిత్ర నిశబ్దంగా ఉండిపోయింది.

"లేండ్‌లైన్ ఫోన్ మోగింది. అవతలినించి ఎవరో 'వినయసాగర్ ఇల్లేనా?' అని అడిగారు. అవునని చెపితే ఆయనకి ఏక్సిడెంటైందని లొకేషన్ చెప్పి వెంటనే రమ్మని ఫోన్ పెట్టేసారు... నేను పిల్లల్ని తీసుకుని వెళ్ళాను. కానీ సుమీ ఏదో ట్రాన్స్‌లో ఉన్నట్లుగా వెళ్ళాను. భాస్కర్ ఇంటికి వెళ్ళిన వినయ్ ఏర్‌పోర్ట్ రోడ్‌లోకి ఎందుకు వెళ్తాడు? ఇది అబద్ధం. వినయ్ కాదు. ఎవరో అనుకుంటూ వెళ్ళాను.... తీరా చూసేసరికి...."

"రేపు మాట్లాడుకుందాం విద్యా."

"వద్దు. ఫర్లేదు. విను. విషయం తెలిసిన వినయ్ స్నేహితులందరూ వచ్చారు. భాస్కర్ భార్యతో వచ్చాడు. అంత దుఃఖంలో కూడా నేనది గమనించి ఆశ్చర్యపోయాను. రెండు వారాల తర్వాత నాన్న బంధువు అదే ఆ కమీషనర్ వచ్చారు. వినయ్‌తో మరో అమ్మాయి ఉందని చెపితే నీలాగే చెప్పాను. 'లిఫ్ట్ ఇచ్చాడేమో' అని. ఆయన తల అడ్డంగా ఊపి చెప్పాడు. 'లేదమ్మా. మిస్టర్ మిసెస్ సాగర్ పేరుతో నోవాటెల్‌లో ఓ డబుల్ రూం బుక్ అయింది. ఈ మధ్య నెలకి రెండు మూడుసార్లు వాళ్ళు అలా రెండురాత్రులు ఉండి వెళ్తున్నారని హోటల్ వాళ్ళు చెప్పారు"

"మైగాడ్!" సుమిత్ర గుండెమీద చేతులు వేసుకుంది.

"ఆ క్షణంలోనే నాలోని తొంభైశాతం దుఃఖం సమిసిపోయింది. దాని స్థానంలో ఉక్రోషం, అవమానం ప్రవేశించాయి."

సుమిత్రకి ఏం మాట్లడాలో అర్థంకాలేదు.

"దురదృష్టవశాత్తూ ఆయన చెప్పేది పక్కగదిలోని మా పిల్లలు విన్నారు. పద్దెనిమిది, ఇరవై ఏళ్ళ వయసుగల మగపిల్లలు ఆ విషయం గురించి నాతో ఎలా చర్చిస్తారు? తండ్రి ప్రవర్తనకి వాళ్ళు బాగా సిగ్గుపడిపోయారు. క్లాసులు పోతాయని ఆ మర్నాడే వెళ్ళిపోయారు. వెళ్ళబోయేముందు పెద్దవాడు నన్ను హగ్ చేసుకుని 'అమ్మా జాగ్రత్తగా ఉండు' అని కన్నీళ్ళు పెట్టుకున్నాడు ఆ మాటలొ నాకు కన్సర్న్ కనపడింది."

విద్య కొంచెం మంచినీళ్ళు తాగి మళ్ళీ చెప్పింది.

"తర్వాత ఆ కమీషనర్ మళ్ళీ మా ఇంటికి వచ్చాడు. "నీకు సూర్యప్రభ అనే ఆమె తెలుసా?" అని అడిగాడు. తెలీదన్నాను. వినయ్‌తో పాటు ఏక్సిడెంట్‌కి గురైన ఆమె పేరు సూర్యప్రభట! ఆయన ఆమె ఫోటో చూపించాడు. అది చూసి నేను ఆశ్చర్యపోయి 'ఈమె సన్‌షైన్. వినయ్ ఆఫీస్‌లోనే పని చేస్తుందని' అని చెప్పాను. ఆయన జాలిగా నవ్వి 'అది మీ ఆయన పెట్టుకున్న ముద్దు పేరేమో' అన్నాడు. వినయ్ అప్పుడప్పుడు తన ఆఫీస్‌లో పని చేసే సన్‌షైన్ గురించి చెప్తూండేవాడు, ఆమెకి తెలివి తక్కువ అని, ఆ

ఫూలిష్‌నెస్ గురించి కథలుగా చెప్పి నవ్వించేవాడు. ఓ ఆఫీస్ ఫంక్షన్‌లో ఆమెని పరిచయం చేసాడు కూడా. సన్నగా, అర్భకంగా ఉంది. నాకంటే రంగు తక్కువ..."

"ఛీ! దాంతో నిన్ను పోల్చుకోకు" సుమిత్ర వారించింది.

"నేను వినయ్ పర్సనల్ లాప్‌టాప్ ఆన్ చేసి చూసాను. ఆమెతో ఎన్ని మెసేజ్‌లో. సన్‌షైన్ అనే ఫోల్డర్‌లో ఆ మెసేజ్‌లు దాచి పెట్టుకున్నాడు. అతి పాత మెసేజ్ ఐదేళ్ళనాటిది. అంటే ఐదేళ్ళుగా ఆమెతో అఫైర్ పెట్టుకుని నాకు తెలీకుండా మేనేజ్ చేసాడు ఐదేళ్ళుగా! అక్కడక్కడ ఆ మెసేజ్‌లు చదివితే నా రక్తం మరిగిపోయింది. అవన్నీ శృంగార సంభాషణలు. 'ఈ రోజు ఆఫీస్‌లో నా పని చేసుకుంటూంటే నువ్వు నా వెనకే వచ్చి మెడమీద ఇచ్చిన ముద్దు, అది ఇచ్చిన గగుర్పాటు నేను జన్మలో మర్చిపోను.'
'హోటల్ టబ్‌లో మన సరిగంగ స్నానాలు నాకు మళ్ళీ మళ్ళీ కావాలి రాజా' ఇలా. వినయ్ రోజూ పడుకునే ముందు ఓ అరగంట ఆఫీస్ పని చేసుకునేవాడు. అది ఇదే అని అర్థమైంది. ఫర్ఫెక్షనిస్ట్ అయిన వినయ్ సీట్ బెల్ట్ ఎందుకు పెట్టుకోలేదో తెలుసా? మధ్యలో వంగి ఆమెని తాకడానికి, ముద్దుపెట్టుకోడానికి ఇబ్బంది అనిట! అది కూడా ఆ మెసేజెస్‌లో ఉంది. నగరానికి దూరంగా నోవాటెల్ హోటల్ అయితే తెలిసినవాళ్ళు కనిపించరు అని అక్కడికి వెళ్ళేవాళ్ళుట." విద్య కంఠం దుఃఖంతో పూడుకుపోయింది.

"ఓ రోజు ఉదయం ఒకతను ఇంటికి వచ్చాడు. సూర్యప్రభ తన భార్యని, తనకి తన భార్యని దూరం చేసింది వినయ్ సాగర్ అని, కోమాలో ఉన్న ఆమె ట్రీట్‌మెంట్‌కి చాలా ఖర్చవుతోందని, నన్ను ఏభై లక్షలు నష్టపరిహారం అడిగాడు. ఇవ్వకపోతే పోలీస్ కేస్ పెడతానన్నాడు. అమాయకురాలిన తన భార్యని ట్రాప్ చేసి ఎక్కడికో తీసుకెళ్ళడానికి వినయ్ ఏర్‌పోర్ట్‌కి తీసుకెళ్తున్నాడని చెప్పాడు. నాకు విరక్తి పుట్టింది వెళ్ళి పోలీసులకి చెప్పమన్నాను. 'నీ పరువు పోయింద'ని బెదిరించాడు. నేనతనికి ఆ మెసేజ్‌లు చూపించాను. సూర్యప్రభ ఎకౌంట్‌నించి వచ్చిన మెసేజ్‌లని చూపిస్తే పోలీసులు అది అడల్టరీ కేసని కొట్టిపారేస్తారని చెప్పాను. మాట్లాడకుండా వెళ్ళిపోయాడు. సూర్యప్రభ కూతురి వయసు ఐదేళ్ళుట!" విద్య బాధగా చెప్పింది.

"ఎంత విషాదం విద్యా!" సుమిత్ర భారంగా చెప్పింది.

"వంటరితనంతో పిచ్చెక్కిపోతోంది సుమీ. మా పెళ్ళి ఆల్బమ్, హనీమూన్ ఫోటోలు, పిల్లల చిన్నప్పటి ఫోటోలు చూస్తుంటే వినయ్ లేరనే దుఃఖం ముంచెత్తుతోంది. సూర్యప్రభ గుర్తురాగానే కోపంతో తిట్టాలనిపిస్తుంది. నీకు తెలుసుకదా. వినయ్ పర్ఫెక్షనిస్ట్. అన్నీ పర్ఫెక్ట్‌గా ఉండాలి. మరి తనెందుకు పర్ఫెక్ట్ హస్బెండ్‌లా ఉండలేకపోయాడు? నేను, పిల్లలు ఏదైనా తప్పులు చేస్తే న్యాయమూర్తిలా జడ్జ్‌మెంట్స్ ఇచ్చేవాడు. గంటలతరబడి ఉపన్యాసాలు ఇచ్చేవాడు. 'డూస్ డోంట్స్' లేకుండా వినయ్ సంభాషణ ముగిసేది కాదు. అతను ఎంత ప్రేమగా చూసినా నేను, పిల్లలు ఆయన సమక్షంలో ఓ హెడ్మాస్టర్ సమక్షంలో ఉన్నట్లుగా ఫీలయ్యేవాళ్ళం. మరి అలాంటివాడు తన 46వ ఏట అలా అక్రమసంబంధం ఎల పెట్టుకోగలిగాడు? ఐదేళ్ళపాటు దాన్ని ఎలా కొనసాగించగలిగాడు? ఆ ఏక్సిడెంట్ జరగకపోతే భాస్కర్ భార్యని చాలాకాలం అమెరికాలో ఉంచేసేవాడు. లేదా మరొకరి భార్యని చంపేయడమో, విడాకులు ఇప్పించి పంపేయడమో చేసేవాడు. ఈ విధమైన కట్టుకథలు ఈ ఐదేళ్ళలో ఎన్ని చెప్పాడో? పిచ్చిదాన్ని. అన్నీ నమ్మేశాను."

"ఊరుకో విద్యా. ఇక పడుకుందాం. రేపు మాట్లాడుకోవచ్చు."

"వినయ్ ఎదురుగా ఉంటే కాలర్ పట్టుకుని నిలదీయాలని ఉంది సుమిత్రా! సూర్యప్రభలో ఉన్న అవయవాలన్నీ నాలో ఉన్నాయి. ఇంకాస్త సౌష్టంగా కూడా ఉన్నాయి. మరి తనలో ఉన్నది నాలో లేనిది ఏమిటి విన్నూ అని అడగాలని ఉంది. చిన్న తప్పులకే పెద్ద శిక్షలు వేసే ఆ న్యాయమూర్తిగారు ఏం సమాధానం చెప్తారో వినాలని ఉంది. కానీ ఏడీ? విన్నూ లేడు. చచ్చిపోయాడు! ఆమె సమక్షంలో కొద్దిసేపట్లో ఆమెతో పొందబోయే స్వర్గ సుఖాల గురించి ఆలోచిస్తూ చచ్చిపోయాడు. బాధ లేకుండా చటుక్కున చచ్చిపోయాడు. ఇంక కనపడడు. నాకు సంజాయిషీ ఇవ్వడు. ఎందుకలా చేసాడో నాకు ఎప్పుడూ జీవితాంతం సస్పెన్సే. నాకు ఎప్పటికీ తెలీదు."

సుమిత్ర ఓదార్పుగా విద్యని దగ్గరకి తీసుకుంది. విద్య ఆమె ఒళ్ళో తలపెట్టి భోరున ఏడుస్తూ చెప్పింది.

"అది నాకు అవమానం సుమీ. నా స్త్రీత్వానికే అవమానం. ఇద్దరు పిల్లల్ని కన్న నా ఆడతనానికి అవమానం. నాలో ఏ లోపం ఉందని వినయ్ అలా చేసాడు? ఆయన్ని అడగాలని ఉంది సుమిత్రా! అతని చెంప మీద కొట్టి ఎందుకిలా చేసావు? అని అడగాలని ఉంది..."

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments